క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీకి సాత్విక ఎంపిక



ట్రిపుల్ ఐటీకి ఎంపికైన సాత్విక

కామవరపుకోట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి పదో తరగతిలో 568 మార్కులు సాధించి మండల ద్వితీయ స్థానంలో నిలిచిన కొండపాములూరి సాత్విక ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖాజా గోపాలకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు సాత్వికను అభినందించారు.

ట్రిపుల్ ఐటీలో లింగపాలెం విద్యార్థులకు సీటు



కుప్పాల రాజా



సాయి ధర్మతేజ

లింగపాలెం: మండలంలోని రంగాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 2024 పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో మండలంలో మొదటి స్థానం సాధించిన కుప్పాల రాజా ప్రతిష్టాత్మకమైన ఒంగోలు ఐఐఐటీలో సీటు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వెంకటరత్నం తెలిపారు. అదే విధంగా జిల్లా పరిషత్ హైస్కూల్ ధర్మాజీగూడెం విద్యార్థి సాయి ధర్మతేజ ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీవీఎస్ఎన్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారులు కె.రామారావు, జె.రవీంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు



క్షతగాత్రులను 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: ఎదురెదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటన మండలంలోని కంసాలికుంట సమీపంలో గురువారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం బుట్టాయగూడెం ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాస వర్మ కొయ్యలగూడెం నుంచి ద్విచక్ర వాహనంపై బుట్టాయగూడెం వస్తున్నారు. అలాగే మండలంలోని రాచూకుకు చెందిన వెట్టి చందు అనే యువకుడు బుట్టాయగూడెం నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఆ సమయంలో వారిరువురూ కంసాలికుంట సమీపంలో ఎదురెదురుగా వస్తూ అదుపు తప్పి ఢీకొట్టుకున్నారు. ఈ సంఘటనలో ఇరువురికి గాయాలయ్యాయని స్థానికులు తెలిపారు. వీరిని 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

శిక్షణ తరగతులు జయప్రదం చేయండి



రాష్ట్రస్థాయి శిక్షణా తరగతుల కరపత్రాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

చింతలపూడి: ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు ఈ నెల 24, 25, 26 తేదీలలో మదనపల్లిలో నిర్వహిస్తారని వాటిని జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కూనపాముల విగ్నేష్ పిలుపునిచ్చారు. నూతన ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. ఈ సందర్భంగా కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తొర్లపాటి బాబు, జిల్లా సహాయ కార్యదర్శి బొక్క శ్రీనివాసరావు, చింతలపూడి నగర నాయకులు బొత్స రాజేష్, ఒడిత్య బాలు, సొంగ మరియదాసు, సర్వేశ్వరావు, శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఎలక్ట్రికల్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా 12న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు (ఆపరేషన్) పి.రాధాకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు, జీలుగుమిల్లి మండలంలోని రాచన్నగూడెం సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 08:00 నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు. సంబంధిత గ్రామాల వినియోగదారులు సహకరించగలరని కోరారు.

చిన్న కుటుంబం.. చింత లేని కుటుంబం

ప్రపంచ జనాభా దినోత్సవంలో డాక్టర్ నరేష్



పోలవరం: ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైద్య సిబ్బంది

చింతలపూడి: జనాభా నియంత్రణ మన అందరి బాధ్యతని, చిన్న కుటుంబం చింతలేని కుటుంబం అని డాక్టర్ నరేష్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం యర్రగుంటపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి జనాభా నియంత్రణ ఒక్కటే మార్గమన్నారు. డా.గీత మాట్లాడుతూ ప్రభుత్వం జనాభా నియంత్రణకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నట్లు చెప్పారు. పురుషులకు 24 సంవత్సరాలు, స్త్రీలకు 21 సంవత్సరాలు కనీస వివాహ వయస్సుగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వి.బాబూరావు, ఎంపీహెచ్ఈఓ పి.శ్రీనివాసరావు, పీహెచ్‌ఎం రమణమ్మ, హెల్త్ అసిస్టెంట్‌లు ఉమ్మడి రాజారావు, సయ్యద్ రసూల్, ఎంపీ సత్యన్నారాయణ పాల్గొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవం

పోలవరం రూరల్: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పోలవరం మండలం వింజరం పీహెచ్‌సీ పరిధిలో వైద్యారోగ్య శాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కె.మురళీకృష్ణ మాట్లాడుతూ ఇద్దరు పిల్లలు ఇంటికి ముద్దు అంటూ పేర్కొన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు.

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

కామవరపుకోట: మండలంలో ఆడమిల్లిలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు అధ్యక్షతన అర్థశాస్త్రం, ఎస్ఎస్ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావు మాట్లాడుతూ జనాభా పెరుగుదల వలన కలిగే నష్టాలను గూర్చి విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు లింగ సమానత్వం, పేదరిక నిర్మూలన, బాల్య వివాహాల నివారణ ఆవశ్యకత గురించి విద్యార్థులకు వివరించారు. రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమ్మడి భీమరాజు అధ్యక్షతన ప్రపంచ జనాభా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జిల్లా స్కౌట్ ట్రైనింగ్ కమిషనర్ బిరుదు గట్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో విద్యార్థులతో మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్కౌట్స్ ట్రైనింగ్ కమిషనర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అవసరాలు కోసం భూమి పెరగడం లేదు, కాబట్టి రానున్న ఉపద్రవాలు ఎదుర్కోవాలంటే మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీనివాసరావు, జి.రామ్మోహన్ రావు, ఎం.ఉషారాణి, కె.ఇందిరా కుమారి, వి.శ్రీనివాస్, ధారావతు మల్లేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: ప్రపంచ జనాభా దినోత్సవ అవగాహన కార్యక్రమం బయ్యన్నగూడెంలో గురువారం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది ప్రజలకు జనాభా నియంత్రణపై అవగాహన కల్పించారు. ఆరోగ్యానికి సంబంధించిన లక్షణాలు అనారోగ్యంపై తీసుకోవలసిన జాగ్రత్త చర్యల గురించి, వర్షాకాలంలో సంక్రమించే సీజనల్ వ్యాధుల గురించి ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎల్. సుబ్రహ్మణ్యం, సూపర్ వైజర్ చాన్‌భాషా, ఏఎన్ఎంలు, పాల్గొన్నారు.



చింతలపూడి: అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు



కొయ్యలగూడెం: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



కామవరపుకోట: పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

స్కంధునికి అభిషేకాలు



స్వామికి అన్నాభిషేకం నిర్వహించిన దృశ్యం

కొయ్యలగూడెం: స్కంధ పంచమి సందర్భంగా గురువారం టెంపుల్స్ సెంటర్‌లో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి విశేష పూజలు నిర్వహించారు. శ్రీ రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయంలో ఉపాలయమైన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారు జాము నుంచి పంచామృతాభిషేకాలు, 54 లీటర్ల ఆవుపాలతో క్షీరాభిషేకం అనంతరం అన్నాభిషేకం నిర్వహించారు. ఆలయ నిర్మాణ దాత కొల్లూరు సుబ్బారావు దంపతులతో ప్రధాన అర్చకులు గుడిపూడి శేషాచార్యులు విశేష పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొయ్యలగూడెం: స్థానిక సబ్ స్టేషన్ పరిధిలోని కొన్ని గ్రామాలలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రాధాకృష్ణ పేర్కొన్నారు. ట్రీ కటింగ్ పనులలో భాగంగా 11 కేవీ పవర్ గ్రిడ్ ఫీడర్‌కి చెందిన కొయ్యలగూడెం, అంకాలగూడెం, రేపల్లెవాడ గ్రామాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కౌలు కార్డులపై అవగాహన తప్పనిసరి

వ్యవసాయాధికారులు



పోలవరం: రైతులకు సాగుదారు హక్కు పత్రాలు అందజేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: రైతులు కౌలు కార్డులపై అవగాహన కలిగి ఉండాలని ఏవో డి.ముత్యాలరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కౌలు రైతులకు సాగు హక్కు పత్రాలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో డి.ముత్యాలరావు మాట్లాడుతూ ఈ-పంట సాగుదారుడు హక్కు పత్రాలు ప్రతీ గ్రామంలో అర్హత ఉన్న షెడ్యూల్ ట్రైబ్ రైతులకు జారీ చేశామన్నారు. ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్టం జరిగినప్పుడు కౌలు రైతులు నష్టపోతున్నారన్నారు. అలాగే పంటల భీమా, పచ్చిరొట్ట విత్తనాలు పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు ఎండి మున్నా, వ్యవసాయ సిబ్బంది కె. మౌనిక, కె. దివ్య, తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో..

కొయ్యలగూడెం: కౌలు కార్డుల మంజూరుపై రైతులకు అవగాహన సదస్సు గురువారం రాజవరం, గంగవరంలో నిర్వహించారు. మండల వ్యవసాయశాఖ అధికారి చెన్నకేశవులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ నెల 20 వరకు కౌలు కార్డుల జారీ అమలు చేస్తామని తెలిపారు. రైతులకు కార్డులు జారీపై (పంట సాగు హక్కుదారు కార్డు) గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. అధిక వర్షాల వల్ల పంట నష్టం జరిగితే క్రాప్ ఇన్సూరెన్స్‌కు ఈ కార్డు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్డు కాల పరిమితి పదకొండు నెలలన్నారు. కార్డు జారీ చేసేందుకు భూ హక్కు కలిగిన సొంత రైతులు సంతకం చేయవలసి ఉంటుందని ఈ విషయంలో భూ హక్కు గల రైతులు ఎటువంటి అపోహ చెందనవసరం లేదన్నారు.



బుట్టాయగూడెం: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ ముత్యాలరావు



కొయ్యలగూడెం: రైతు సదస్సులో మాట్లాడుతున్న మండల వ్యవసాయ శాఖ అధికారి

రైతు సేవా కేంద్రంలో గ్రామసభ

పోలవరం రూరల్: మండలంలోని గూటాలలో రైతు సేవా కేంద్రంలో పంట సాగుదారుల హక్కు పత్రం జారీ నిమిత్తం సాగుదారులను గుర్తించడం కోసం గ్రామ సభ నిర్వహించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయశాఖాధికారి కె.రాంబాబు మాట్లాడుతూ కౌలు కార్డులు మూడు రోజుల్లో జారీ చేస్తామన్నారు. కౌలు రైతులు దరఖాస్తులకు రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌వో బి.వినయ్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

కొండముచ్చు దాడిలో విద్యార్థికి గాయాలు

జంగారెడ్డిగూడెం: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఓ విద్యార్థిని కొండముచ్చు దాడి చేసి కరిచింది. 9వ తరగతి చదువుతున్న తెల్లం వంశీని కొండముచ్చు కరవగా అతనిని ఉపాధ్యాయులు స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఇటీవల ఒకరిద్దరిని కరిచినట్లు చెబుతున్నారు. హైస్కూల్ పరిసర ప్రాంతంలోనే కొంత కాలంగా తిరుగుతోంది. విద్యార్థులతో కలిసి భోజనం కూడా చేస్తోంది. అయితే విద్యార్థులు దానిని కొట్టడంతో తిరగబడుతోందని చెబుతున్నారు.

కౌలు గుర్తింపు కార్డుల పంపిణీ



కౌలు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని శ్రీనివాసపురం సచివాలయంలో పంట హక్కు సాగు పత్రం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ యడ్లపల్లి రాధిక, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్ర శేషు చేతుల మీదుగా రైతులకు కౌలు రైతు గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తాతారావు, టీడీపీ నాయకులు పోల్నాటి సత్యనారాయణ, ఎలికే ప్రసాద్, తాళ్లూరి వెంకటేశ్వరరావు, తడికల మోహన్, తదితరులు పాల్గొన్నారు.

చాంపియన్‌షిప్‌లో సుభాష్‌కు తృతీయ స్థానం



అవార్డును అందుకుంటున్న చిన్నారి ప్రతిభ సరోజారెడ్డి

జంగారెడ్డిగూడెం: కర్ణాటక స్టేట్ మెమోరీ చాంపియన్‌షిప్ పోటీల్లో జంగారెడ్డిగూడెం ప్రతిభ స్కూలు అకడమిక్ డైరెక్టర్ కాసర సుభాష్‌రెడ్డికి తృతీయ స్థానం లభించింది. ఈ సందర్భంగా ప్రతిభ స్కూల్ ప్రిన్సిపాల్ కాసర సరోజారెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ పోటీల్లో సుభాష్ తృతీయ స్థానంలో నిలిచి సెకండ్ రన్నరప్ ట్రోఫీ, కాంస్య పతకంతోపాటు వివిధ ఈవెంట్స్‌లో ఐదు మెడల్స్ సాధించారు. రాండం వర్డ్స్ ఈవెంట్‌లో ఐదు నిమిషాల్లో 80 పదాలు గుర్తుపెట్టుకుని రాయడంతో వెండి పతకం సాధించినట్లు చెప్పారు. అలాగే 7వ తరగతి చదువుతున్న ప్రతిభ సరోజ్ రెడ్డి కిడ్స్ విభాగంలో రెండు పతకాలు సాధించినట్లు చెప్పారు. ర్యాండం వర్డ్స్ ఈవెంట్ లో 4వ స్థానం, బైనరీ నెంబర్స్ ఈవెంట్ లో 7వ స్థానంతో రెండు పతకాలు కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ప్రతిభ స్కూల్లో నిర్వహించిన అభినందన సభలో సుభాష్, ప్రతిభకు డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మీ సరోజా రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ సింధుషారెడ్డి, విద్యార్థిని విద్యార్థులు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

బ్రాహ్మణ దూషణపై చర్యలు చేపట్టాలి



కొయ్యలగూడెం ప్రాంతీయ బ్రాహ్మణ సమాఖ్య

కొయ్యలగూడెం: బ్రాహ్మణులపై అసభ్యకర పదజాలంతో, అమానవీయ రీతిలో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన విజయనగరం జిల్లా పార్వతీపురానికి చెందిన పైలా దాస్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కొయ్యలగూడెం ప్రాంతీయ బ్రాహ్మణ సమాఖ్య డిమాండ్ చేసింది. గురువారం సమైఖ్య అధ్యక్షులు ఏవీఆర్‌జీ మృత్యుంజయశర్మ (రామం) అధ్యక్షతన ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో బ్రాహ్మణ సమైఖ్య సభ్యులు పాల్గొన్నారు. సోషల్ మీడియా సామాజిక మాధ్యమాల ద్వారా పైలాదాస్ మరికొందరు కలసి బ్రాహ్మణుల గురించి అర్చకుల గురించి అదేవిధంగా బ్రాహ్మణ స్త్రీల గురించి అనుచితంగా వ్యాఖ్యలు చేయడం తమను తీవ్ర మనోవేదనకు గురి చేసింది అన్నారు. ముఖ్యంగా తమ స్త్రీలు అత్యంత అవమానంగా భావిస్తూ ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. ఇందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని, వారి చేత బ్రాహ్మణ సమైఖ్యకు క్షమాపణ మీడియా పరంగా చెప్పించాలని కోరారు. ఈ దుశ్చర్యను ఖండిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ పంపుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మామిళ్లపల్లి బద్రీనాథ్, అనిపెద్ది రాధాకృష్ణమూర్తి, మామిళ్లపల్లి చింతామణి, పొన్న శివరామకృష్ణ రమేష్, కోదాటి నాగమణి, వజుల సీతారాం బాబు, బొల్లాప్రగడ ప్రసాద్, పెడసనగంటి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ముందస్తు చర్యలు తీసుకోండి



చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డివిజనల్ పంచాయతీ అధికారి

కామవరపుకోట: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జంగారెడ్డిగూడెం డివిజనల్ పంచాయతీ అధికారి ఎండీ రజాఉల్లా అన్నారు. గురువారం కామవరపుకోట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జె.స్వర్ణ భారతితో కలిసి మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలం దృష్ట్యా ప్రత్యేక పారిశుద్ధ్యం పనులు చేపట్టి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. వేస్ట్ టు గోల్డ్ నిర్వహణ కేంద్రాలుగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాలు రూపొందించాలని కార్యదర్శులు చర్యలను ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. అనంతరం కామవరపుకోట గ్రామ పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో విస్తరణాధికారి జి.మరిడియ్య, పంచాయతీ కార్యదర్శి జీడీ శ్రీనివాసరావు, డీపీఆర్‌సీ కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కల్యాణ మండపానికి స్థల పరిశీలన

ద్వారకాతిరుమల: గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు గురువారం ద్వారకాతిరుమలలో నాయీ బ్రాహ్మణుల కల్యాణ మండప నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. ముందుగా గ్రామానికి విచ్చేసిన ఆయన ప్రభుత్వ ఖాళీ స్థలాలు, ఇళ్ల స్థలాలను పరిశీలించారు. అలాగే నాయీ బ్రాహ్మణుల కల్యాణ మండప నిర్మాణానికి కావాల్సిన స్థల సేకరణ నిమిత్తం ఆర్ఎస్ నెంబర్ 47లోని భూమిని, పోలీస్ క్వార్టర్స్ వెనుక స్థలాన్ని పరిశీలించారు. గుడి సెంటర్‌లో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా రోడ్డుకు ఇరువైపులా దుకాణాలను వెనక్కి జరిపించాలని అధికారులను ఆదేశించారు. గ్రామానికి సంబంధించిన పూర్తిస్థాయి సమాచారాన్ని రెండు వారాల్లోగా తనకు అందించాలని రెవెన్యూ అధికారులకు, గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని పంచాయితీ కార్యదర్శికి ఆయన సూచించారు. అదేవిధంగా అన్యాక్రాంతమైన పసరుకోనేరు స్థలాన్ని ఆయన పరిశీలించారు.

ఇత్తడి మకర తోరణం బహూకరణ



దాతలను సత్కరించిన వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ కమిటీ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో పునర్నిర్మాణం చేస్తున్న శ్రీవల్లి దేవసేన సేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి ఇత్తడి మకర తోరణం సమకూరింది. గురువారం ఉదయం అయినాల వెంకట రమణమూర్తి, నిర్మల దంపతులు శ్రీవల్లి దేవసేన సేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి ఇత్తడి మకర తోరణం అలంకరించారు. అనంతరం చల్లా నరసింహమూర్తి ఆర్థిక సహాయంతో అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు దాతలను సత్కరించారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న జ్యుడీషియల్, పోలీసు సిబ్బంది

జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు

చింతలపూడి: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు అన్నారు. స్థానిక ప్రైవేట్ కళాశాలలో గురువారం విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. చట్టాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండ పట్టుదలతో చదివి లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. సీఐ ఎం.సుధాకర్ మాట్లాడుతూ కళాశాలల్లో ర్యాగింగ్ నిషేధమన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత వాహనాలు నడిపేటప్పుడు రవాణా శాఖ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సామయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగేశ్వరరావు, ఐసీడీఎస్ పీఓ మాధవి, సోషల్ వర్కర్ అక్బర్ ఆలి, తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ పనులు వేగవంతం చేయాలి



పీఓడబ్ల్యు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

కుక్కునూరు: జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో వర్షాకాలం వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ చర్యలు వేగవంతం చేయాలని పీఓడబ్ల్యు నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కుక్కునూరులో ప్రగతి శీల మహిళా సంఘం జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ సమావేశం తొడం సీతమ్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పీఓడబ్ల్యు డివిజన్, సహాయ కార్యదర్శులు కారం సత్యవతి, ఎస్కే మున్నిలు మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని మండలాల్లో వర్షాకాలం మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, శానిటేషన్ పనులు పటిష్టంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. ఐటీడీఏ పీఓ ప్రత్యేక బాధ్యత తీసుకొని ఆరోగ్య అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో గడ్డాల వీరమ్మ, డివిజన్ నాయకురాలు కన్నమ్మ, కట్టాం రత్తమ్మ, సోడే విజయ, రమాదేవి, మచ్చా ముత్తమ్మ, సున్నం రాణి, మచ్చా సుభద్ర, రమణ, కవిత, సుశీల, తదితరులు పాల్గొన్నారు.